★ మనసంఘం

చెడితే చేరనివ్వదు బాగుంటే ఓర్వదు

> అమ్మా! ఏ సంఘ మర్యాదలకోసము మీ రింత ఆత్మను, శరీరాన్ని, హృదయాన్ని పాడుచేసుకున్నారో, దేనియొక్క మర్యాదను కాపాడటానికి మీ రిప్పుడు ప్రాణత్యాగం చేసుకున్నారో ఆ సంఘం మిమ్ము ఉద్ధరించిందా? లేక మీరు మరణిస్తే 'అయ్యో' అంటుందా?
>
> —శ్రీమతి సి. కమలాదేవి

(బాలవితంతు)

సుశీల కాపురానికివెళ్ళి మూడు సంవత్సరాలన్నా నిండలేదు.

పండువంటికాపురం; తలవని తలంపుగా సుశీల భర్త మరణించాడు. బాగా సంపాదిస్తూ సుఖంగా వున్నవాళ్ళేగాని వెనుక ముందు ఆలోచించినవారుకారు. సుశీలకు తలిదండ్రులులేరు. కూడ పెట్టిన ధనంలేదు. చేతిలో రెండేళ్ల పసిపాప ప్రేమలత ఇద్దరు అన్నగార్లుతప్ప మరి దిక్కులేరు సుశీలకు.

ప్రకాశం చిన్న అన్నగార్కి పిల్లలులేరు. బాగా సంపాదిస్తున్నాడు. చెల్లెలు దుస్థితికి మనసు కరిగిపోయింది. భార్యతో అన్నాడు. 'హేమా! సుశీల పుట్టింట్లో, అత్తవారింట్లోకూడ చాల ప్రేమగా పెరిగింది. ఆమెకు అనుకోనికష్టం సంభవించింది. మనతో కూడ మద్రాసుకు పిలుచుకుని వెడదామా?'

హేమ 'నిజమే ఆవిడకు రాకూడని కష్టమేవచ్చింది. నుదుటి వ్రాతను తప్పింప ఎవరితరము. నాకు చాల దుఃఖంగానేవున్నది. అయితే మనమేమిచేస్తాము. ఈ కాలంలో ఎవరిపొట్ట వాళ్ళు పోసుకొని మర్యాదగా కాలం వెళ్ళద్రోస్తేచాలు. మీ కెందుకా వుబుసు. మీ అన్నగారున్నారు. వారియిష్టం. మీరాప్రస్తాపనే చెయ్యవద్దు' అని ఖండితంగా చెప్పేసింది. భార్యమాటను జవదాటని ప్రకాశం యిక ఏమంటాడు? పలక్కుండా మద్రాసు వెళ్ళిపోయారు.

రామమూర్తి పెద్దసంసారి. స్వల్ప జీతగాడు. తనకువచ్చు వేతనము తనభార్య పిల్లలను పోషింపనే చాలదు. పాపం రామమూర్తి, ప్రకాశం ఈ విధంగా పలక్కుండ వెళ్లిపోతాడని అనుకోనేలేదు. సుశీల, ప్రేమలతల పోషణబాధ్యత రామమూర్తిమీదే పడింది. సుశీలకు భర్త మరణించేసరికి పద్ధెనిమిది సంవత్సరాలు. రామమూర్తికి ఒక మేడయిల్లుతప్ప పెద్దల ఆస్తి ఏమిలేదు. నెలకు ముప్పదిరూపాయిలకన్నా ఎక్కువ జీతంలేదు. ఆరుగురు పిల్లలు, చెల్లెలు, భార్య యింతమంది జీవనము అందులోకావలయును. ఇంట్లో అంతచాకిరి సుశీలపైనేపడింది. రామమూర్తిభార్య సావిత్రమ్మ ఎదుటివారి హృదయం గ్రహించకుండా మాట్లాడే స్వభావం, పైగా గోరంతదాన్ని కొండంత చేసేదికూడాను.

సుశీల ఓర్పుగలదేగాని మాటలంటేమాత్రం ఓర్చేదికాదు. సావిత్రమ్మ ఒక్క సంవత్సరము మాత్రం అంతగా ఏమి అనకుండా బాగానే చూచింది. అదిప్రేమో, దయయో, పశ్చాత్తాపమోగాని సుశీలకు

భర్తలేని కొరతగాని, తల్లిదండ్రులులేని లోపముగాని అంతగా అవుపించకుండా వుంటూవుండేది. ఎక్కువ ఆదరణగా వుండేది.

♦ ♦ ♦ ♦

ఇప్పుడు సుశీలకు పందొమ్మిదో సంవత్సరము నిండుతూవుంది. ఆమె ఒక్క సంవత్సరం అన్నం నీళ్ళులేకుండా దుఃఖిస్తూవుండింది. తర్వాత తనకుతానే కొంత ధైర్యముతెచ్చుకొని తెప్పరిల్లేది. స్నానంచేసి శుభ్రమైన వస్త్రములధరించేది. తలదువ్వి జడవేసుకునేది. ఇంటిపనులనుకూడా విసుగులేకుండా శ్రద్ధగా చేసేది. సావిత్రమ్మకు సుశీలయొక్క ఈమార్పు నచ్చలేదు.

'ఏం తప్పు! ఎవరన్నా వింటే నవ్విపోతారు. నీ బ్రతుకేమి? నీకు దేవుడురాసిన వ్రాత ఏమి? చిన్నభర్త......అన్ని సంగతులు జరిగింది...అనుకుంటే నీకు దుఃఖమన్నారాదేమో? ఈమధ్యన నీ సొగసులు, నీ జడలు, నీ ప్రవర్తనము నాకేమి నచ్చలేదు. నీవు మర్యాదనంతా పాడుచేస్తున్నావు. జాగ్రత. యికమీదన్నా మెలుకువగా ఉండు' అన్నది సావిత్రమ్మ.

గొప్పవారు నూరు తప్పులుచేసినా బయటపడదుగాని బీదవారు ఒక చిన్న తప్పుచేసినా అది బ్రహ్మాండమగుట సహజమేకదా? ఇప్పుడు ఎక్కడపట్టినా సుశీలనుగూర్చే మాటలు.

పాపం చేసేవాళ్లకన్నా దాన్నిగూర్చి చెప్పుకునేవాళ్లదే ఎక్కువ పాపం. సుశీల గృహకార్యాలందు, పిల్లలపోషణమునందు యేలాటి లోపములేకుండా వదినగారి పనులన్నీకూడా తనేచేస్తుండేది. 'అదృష్టం బాగాలేనప్పుడు అంటిందంతా బొగ్గయిందట', సుశీలనుచూస్తే సావిత్రమ్మకేమో మెప్పులేదు.

సుశీల భర్తమరణించి నాలుగు సంవత్సరాలు అయింది. ఈ నాలుగు సంవత్సరాల్లో సుశీల ఇంట్లోవాళ్ళతో, బయటివాళ్ళతోకూడా కావలసినన్నిమాటలు పడింది. ఆమెలో ఏతప్పూ లేదు. ఆమె హృదయం చలించలేదు. లోకం ఏమనుకున్నా ఇప్పటివరకు సుశీల ఏపాపం ఎఱుగదు. అందరు ఆమెను నిందించడానికి ఆమె విధవయై జడవేసుకోవడం, బొట్టుపెట్టుకోవడం, పురుషులతో జంకకుండా మాట్లాడడం కారణాలు.

♦ ♦ ♦ ♦

రామమూర్తిగారి ఎదురింట్లో ప్రసాద్ అని ఒక యువకుడున్నాడు. అతనికి ఇటీవలనే భార్య మరణించింది. అతనంటే స్త్రీలందరికి హడలు. అతను స్త్రీలోలుడనీ, దుర్మార్గుడనీ ఆవూర్లో అంతావదంతి. సుశీల చాలా రూపవతి. ఆమె ఎక్కడికన్నా వెళ్ళినపుడు, మేడమీద వున్నపుడు ప్రసాదు ఆమెను వూరక చూచేవాడు. ఈ సంగతి గుసగుసలతోనే వూరంతా అల్లిపోయింది. సుందరమ్మ రహస్యంగా సావిత్రమ్మవద్దకువచ్చి ప్రసాదుకున్నూ సుశీలకున్నూ సంబందంవుందనీ, ప్రతిరోజు వారు ఒకరినొకరుచూచి నవ్వుకోవడం తను చూచిందనీ, ఉన్నవీ లేనివి అంతా కల్పించి చెప్పింది.

'మట్టుమర్యాద మంటలో కలిసిపోయింది. న్యాయం అన్యాయం అసలులేదు. ఏమికాలం వచ్చింది. ఈ ఇంట్లో ఇక ఒక గడియకూడా వుండను' అన్నది సావిత్రమ్మ.

'ఏం వచ్చిందంతా?' అన్నాడు రామమూర్తి.

'ఏ వచ్చిందా? పిల్లలవాళ్ళం మర్యాదకులస్తులం. విధవలకంతా నాజూకు ముదిరిపోయింది. భర్తలు కావలసివచ్చింది. బయటికి తలపెట్టలేకుండా ఉన్నాను' అంది.

'కొంచం జాగ్రత్తగా మాట్లాడు' అన్నాడు రామమూర్తి.

'జాగ్రత ఏమిటి? లోకమంతా మీచెల్లెల్నిగూర్చి బాగా ఎరుగును. నేను, పొరుగింటావిడ ప్రత్యక్షంగా చూశాము. ఇక రహస్యమేమిటి? కావలస్తే ఋజువుచేయిస్తాను' అంది సావిత్రమ్మ.

'ఆలోచించి......సుశీలనా......పోనిలే నీవు వూరుకోరాదూ?' అన్నాడు.

'అల్లాకాదు ఈ సంగతి తేలిపోవాలి. నేను యిక సుశీలతో ఒకక్షణం వుండలేను. దాన్ని ఇంటినుంచి వెళ్లిపోనిస్తేనేగాని కాదు. మొదటినుంచి ఆమెను మనయింట్లో వద్దనిచెప్పాను విన్నారా? ఇప్పుడు ఫలానావారి చెల్లెలని ఎంత అపకీర్తివచ్చిందో తెలుసా?'

వీరి సంభాషణంతావింటున్న సుశీల 'అన్నయ్యా! ఇటువంటి అపకీర్తి నానెత్తిన పడుతుందని నేనెన్నడూ తలపలేదు. నేను పాపరహితనంటే ఇకమీరు నమ్మరు. వదినా! మీ మర్యాద కేలాటి లోపం రానివ్వకుండా కాపాడుకోండి. నేనే ఈ ఇల్లువదలి వెళ్లిపోతాను' అని చేతితో ఆరు సంవత్సరాల ప్రేమను పట్టుకుని బయటకువెళ్లింది సుశీల...

సుశీలకు తన బ్రతుకుమీద. రోతగల్గింది. ప్రాణత్యాగానికికూడా సిద్ధపడింది. ప్రేమలతమీది ప్రేమయే ఆమెను ఆత్మహత్యనుంచి తప్పించింది. యిక వారి జీవనమెల్లాగడుస్తుంది? ఆమెవద్ద ఒక్క కాని కూడలేదు. చేతిలో ఒక బంగారపుగాజుమాత్రం వుంది. యిక ఒంటిమీద మరేసొమ్ములులేవు. ఆ ఒక్క గాజు నష్టంమీద అమ్మేసి ఆ వచ్చినపైకంతో యిద్దఱూ మద్రాసుకువచ్చి చేరుకున్నారు.

సుశీల మద్రాసుకువచ్చి తిరువల్లిక్కేణిలో ఒక చిన్నసందులో ఒక చిన్నగది రెండు రూపాయిల అద్దెకు పుచ్చుకుంది. భర్త మరణించినతర్వాతగాని, అందరు తన్ను నిందించునప్పుడుగాని ఆమెకు ఆమె సొగసుమీది శ్రద్ధతగ్గలేదు. ఆమె కిప్పుడు తన దేహారోగ్యాన్నిగూర్చిగాని, శరీరపోషణాన్నిగూర్చిగాని శ్రద్ధలేదు. ఆమెకు అన్నిటిమీద విరక్తికలిగింది. ఆమెకు నిద్రాహారాలమీద చింతలేదు. కేవలం ప్రేమకోసరమే బ్రతికి వుంది. ఆమె వారిరువురిపోషణార్థము సంపాదించుకోడానికి అక్కడక్కడ వంటలుచేస్తూ, కూలిపనులుచేస్తూ వుండింది. సుశీల ఈకూలి జీవనంలో ఒకటికాదు, అనేకకష్టాలు అనుభవించింది. ఆమె తన శరీరపోషణయందు శ్రద్ధమాని కృశించుచున్నను, ఆమె రూపమున్ను, వయస్సున్ను ఆమెను ఎక్కడ బ్రతకనివ్వకుండా చేశాయి.

♦ ♦ ♦ ♦

సుశీల మద్రాసుచేరుకుని ఏడు ఎనిమిది సంవత్సరాలు కావచ్చింది. ఇప్పుడు ఆమె ఒకరిండ్లకు వెళ్లి పనిచెయ్యడం మానుకున్నది. ఒక కుట్టుమిషన్ కొని అందుమీద చౌకధరకు అందరికి బట్టలు కుట్టిచ్చేది. ఈ వృత్తివలన కొన్నిరోజులు కొంతమట్టుకు ఒక మోస్తరుగా జీవింపగలిగింది. ఇప్పుడు ప్రేమకు పదమూడవ సంవత్సరం. శుక్లపక్షంనాటి చంద్రునివలె ఆమె దినదినాభివృద్ధిజెందుతూంది. రూపలావణ్యాల్లో తల్లికన్నా ఎక్కువ రూపవతి అయింది. బాలికాపాఠశాల్లో ఫోర్తుఫారం చదువుతూంది. చదువుయందు, రూపమందు,

తెనివితేటలందు ప్రేమయేమొదటిది. సుశీల తిరువళ్లిక్కేణిలో తమ నిర్వాహం సరీగా జరుగనందున మద్రాసుటవునులో కాపురంచేరింది. టవునులో కుట్టుటకు బట్టలు దొరికేవి. అందువల్ల వాళ్లకు అట్టేకష్టం లేకుండా దినాలు గడిచేవి. కాని కొద్దిరోజులకంతా వారి కొక క్రొత్తకష్టం ఏర్పడింది. అచ్చటివారంతా వీరినిగూర్చి విపరీతంగా భావించేవారు. వీరికెవ్వరు బంధువులుకూడ లేరా? అనీ, ప్రేమ ఆమెకూతురు కాదనీ, సుశీల ఆ పిల్లతో వ్యాపారంచేయడానికి వచ్చిందనీ అనుకునేవారు.

♦ ♦ ♦ ♦

క్రమంగా సుశీలకు కుట్టుపనిలో రాబడి తగ్గిపోయింది. యథాప్రకారం వారిని కష్టం, దుఃఖం వదలలేదు. సుశీలమాత్రం ఇంట్లోవుంది. తలుపుతట్టిన శబ్దము వినవచ్చింది. సుశీలవెళ్లి తలుపుతీయగా ప్రేమ ప్రత్యక్షమైంది.

'ఏమి ప్రేమా! ఇంత త్వరగావచ్చావు? అప్పుడే బడి వదలిపెట్టారా?' అన్నది సుశీల.

'ఈరోజు అర్ధగంట ముందువదిలేసినారు. చంద్రశేఖరంగారను ధనవంతులు మా స్కూలుకు లక్ష రూపాయిలు విరాళమిచ్చారట. వారు మాస్కూలు తనిఖీకి బొంబాయినుండి వచ్చారు. వారు మన కులస్థులేనట. ఈరోజు రాత్రి ఎనిమిది గంటలకు మనయింటికి వస్తామనిచెప్పారు. మనయింటి అడ్రసుకూడా తీసుకున్నారు' అంది ప్రేమ. సుశీల ఈ మాటలనువిని భయాశ్చర్యములకు లోనైంది. తనలో 'అంత ధనవంతులు మనయింటికి వచ్చుట మంచికో చెడ్డకో పాలుపోకున్నది. అన్నిటికి దేవుడేదిక్కు' అనుకొన్నది.

రాత్రి ఎనిమిదిగంటలు. కారు శబ్దమయింది. కారులోనుంచి ముప్పది, ముప్పదిరెండు సంవత్సరాల లోపుగల యువకుడు లోన ప్రవేశించాడు. సుశీల వారికి మర్యాదతో కూర్చునుటకు ఆసనంచూపింది. తర్వాత తమబోటి ధనవంతులు మాబోటి బీదవారియింటికి వచ్చుటకు కారణమేమని వినయంగా అడిగింది సుశీల.

'అమ్మా! మీరు అలా తలంపవద్దు, మీకు ప్రేమ ఒకర్తేనా కుమార్తె?' అన్నాడు శేఖరం.

'ఆ అవునండీ. అయితేనేమి' అన్నది భయంతో.

'అమ్మా! ఏమి భయపడవలదు, మీ కుమార్తెను నాకిచ్చి పెండ్లిచేయుదురా? అని అడుగనే నిచ్చటికి వచ్చాను' అన్నాడు శేఖరం.

సంతోషాశ్చర్యములతో కొంతవరకు ఏమి జవాబు చెప్పలేకపోయింది సుశీల. 'అయ్యా మీబోటివారు మావంటివారి బీదబాలికను పెండ్లియాడగోరుట మాయొక్క భాగ్యం. నాకేలాటి ఆటంకంలేదు. యిందుకు ప్రేమయొక్క అభిప్రాయంకూడ తెలుసుకొనవలెను' అన్నది సుశీల. కొంతసేపు ఆలోచించి 'అయ్యా తాము కోపగించుకొనరుకదా! నేనొకమాట అడుగ కోరుతాను. తాము ఇంత ధనాఢ్యులు, రూపవంతులుగా నుండి యింకా వివాహమాడకుండుటకు ఏమి కారణం?' అన్నది వినయంగా సుశీల.

'నాకు మొదట ఒక వివాహమైనది. ఆమె ఒక సంవత్సరం కాపురంచేసి మరణించింది. ఆమె మరణించింతర్వాత నాకు ఎవ్వరియందును ప్రేమగలుగలేదు. కాని మీప్రేమను చూచినప్పటినుంచి మనస్సు మనస్సులోలేదు. మీప్రేమను నాకిచ్చి పెండ్లిచేసినచో పెండ్లిచేసుకొనెదను. లేనిచో ఇక ఈ జీవితమందు మరి ఏ ఇతరస్త్రీని పెండ్లాడజాలనన్నాడు' శేఖరం.

ప్రేమలతకూడా అతనిని ప్రేమించియున్నందున ఏలాటి ఆక్షేపణలేక కొన్ని రోజులకంతా ప్రేమకూ, శేఖరమునకు మహా వైభవంగా పెండ్లి జరిగిపోయింది. కూతురూ, అల్లుడితో సుశీలకూడా బొంబాయికి వచ్చింది. తనలో ప్రేమయొక్క అదృష్టమునకు పరమానందం పొందింది సుశీల.

♦ ♦ ♦ ♦

సుశీల, బొంబాయికివచ్చి ఆరునెలలు కావచ్చింది. ఆమెకు కూలికి బట్టలుకుడుతూ స్వతంత్రంగా మద్రాసులో వున్న దినాలే బాగుండినవి. ఇప్పుడు ఆమె అనుభవించుచున్నంత కష్టము ఎన్నడు అనుభవించి యుండలేదు. ఎల్లప్పుడు విచారంతో ఓప్రక్క కూర్చుని ఉండేది. ఆమెకు అట్టే కఠినమైనపనులు లేక పోయినా అందరూ ఆమెను బానిసగాచూచేవారు. బయటికి షికారు వెళ్లేటప్పుడైనా ఆమెను పిలిచేవారు కారు. ఆమె జీవితంలో ఆమె ఇంతగా ఎప్పుడు బాధింపబడలేదు. ఆమెకు వారి అలవాట్లు, వారి పద్ధతులు ఏదీ నచ్చలేదు. ఆ ధనవంతుల గృహపంజరమునుండి ఎప్పుడు స్వతంత్రించి యుండగలనను దుఃఖము అధిక మవుతూ వుండేది.

♦ ♦ ♦ ♦

ప్రేమలతకు వారి పద్ధతులంతా త్వరలో అలవడిపోయింది. ఆమె వారితో కలిసిమెలిసి స్వేచ్ఛగా నుండుచుండెను. సుశీలకు క్రమంగా తినుఅన్నం ఒంట పట్టడంలేదు. రానురాను మనోవ్యాధిచే శుష్కించి పోవుచుండెను. సుశీలను ప్రేమతప్ప మరెవ్వరూ పలకరించేవారుకారు.

ప్రతిరోజు శేఖర్ రెండవభార్య ప్రేమను చూచుటకువచ్చే స్నేహితులకు లెక్కలేదు. ప్రేమలతకు ఎన్నో ప్రజంటేషనులు వచ్చాయి. ఒకసారి కొందరు స్త్రీలు ప్రేమను చూచుటకువచ్చారు. వారు భాను మతితో 'భాను! ఆ గదిలోకూర్చున్న ఆవిడెవరు? పిచ్చిదానిలాగా ఉందే' అన్నారు, సుశీలనుచూపి.

భాను కొంతసేపు ఏమితోచకుండా 'ఆ-ఆఆవిడనా! ఆమె మావదిన ప్రేమలతను చిన్నతనం నుంచి ఎత్తి పెంచినదాది. ఆమె ప్రేమనువిడచి వుండలేనందున మా వదినగారితోకూడా పంపారు' అంది భానుమతి మెల్లగా. ప్రక్కగదిలోనే కూర్చున్నసుశీల ఈ మాటలన్నీవినింది. ఆమెకన్నులు చీకటిక్రమ్మినవి. ఆమెకు అయిదునిముషములు స్మృతితప్పినది. కొంతవడికి తెప్పరిల్లి తనలో హా. ఈ ధనాఢ్యుల ఇంట్లో నా ప్రియపుత్రికప్రేమను ఇచ్చి నాప్రాణప్రదమైన ప్రేమనుకూడా పోగొట్టుకుంటిని. యిక ఈ ఇంట్లో నాకే మున్నది. ఆమె ఆ ఇంట్లో మరి ఒక్కక్షణం నిలువలేకపోయింది. సుశీల నేరుగా ప్రేమవద్దకు వెళ్లింది.

'అమ్మా! ప్రేమా! నీవద్దనుంచికూడా నేను వేరైపోతానని కలలోకూడ తలవలేదు. తల్లీ! ప్రేమా! ఎక్కడన్నా నూరేండ్లు దీర్ఘాయుష్వంతురాలవై సుఖంగా ఉండు. ఇక ఈ రోజునుంచి నీవు నీతల్లిని చూడవు ప్రేమా! నాకు సెలవియ్యి, నేను వెళ్లిపోతున్నాను' అంటూ ఆపుకోలేనిప్రేమచే ప్రేమను ఆలింగనం చేసుకుని తన్ను తెలియని రెండు కన్నీటిబిందువులు రాల్చింది.

దిగ్భ్రాంతిగా 'అమ్మా ఏమంటున్నావు, ఎక్కడికి వెడతానంటున్నావు. నీకిక ఎవరున్నా రమ్మా! నాకొరకు నీవెన్ని కష్టములకో ఓర్చి నన్ను ఒక గృహిణిగాచేసితివి. నన్నువదలి ఎక్కడికి వెడ తావు? నీవిక్కడే ఉండు'మని ఎంతో నిర్బంధించింది ప్రేమ.

కాని ప్రేమయొక్కమాటలు ఆమెను అచ్చట నిలపలేకపోయాయి.

'ఇక ఒక్కక్షణంకూడా ఈ ఇంట్లో ఉండజాలను.' అంటూ ప్రేమయొక్కమాటలు వినిపించు కోకుండా ఆ ఇల్లువదలి వెళ్లిపోయింది సుశీల.

♦ ♦ ♦ ♦

మధ్యాహ్నం మూడుగంటలనుంచి కాలు ఎక్కడెక్కడ అడుగు పెడుతుందో అక్కడికంతా నడచి వెడుతూంది సుశీల. ఎక్కడికి వెళ్ళవలయునో ఏమి చేయవలయునో ఆమెకేమితోచలేదు. సాయంత్రం

ఏడు ఏడున్నరగంటకు ఎక్కడెక్కడో తిరిగి (చౌపాటి) సముద్రం ఒడ్డుకువచ్చిచేరింది సుశీల. ఆకసమున మేఘమాలికలు ఆవరించాయి. గొప్ప వర్షము కురియునట్లున్నది.

'ఓ సముద్రుడా! నన్ను పిల్చుచున్నావా? నీవే నన్ను ఆదరించవలసినవాడవు. యిక నాకీ ప్రపంచంలో ఎక్కడా స్థలంలేదు' అంటూ సుశీల మెల్లమెల్లగానడుస్తూ నడుములోతు నీటిలోనికివెళ్లింది. 'ఏమి యిక మణిగిపోవలసిందేనా? దూరముగానుంచిచూచిన సొగసుగానున్న ఈ సముద్రము యింత భయంకరమవుతున్నదేమి?' మరల నీటిలో యింకాకొంచం ముందుకు వెళ్లసాగింది. క్రమంగా ఆమె తల మాత్రం అస్పష్టంగా కనబడుతూంది.

విలాసార్థము పడవలోవెళ్ళిన ఒకపురుషుడు వర్షభయముచే తిరిగి వస్తుండగా నీటిలో మునగనున్న సుశీలను చూచి తమపడవలోనికి ఎక్కించుకుని వడ్డునకు తెచ్చాడు.

'అమ్మా! మీరెవరు? ఇంతరూపముగలవారై ఉండి ఈ ప్రకారం నీటిలోమణిగి మరణింప తలచుటకు కారణం ఏమి'? అన్నాడు పడవలోని పురుషుడు.

'అయ్యా! నన్ను మరణింపనీయండి. నాకు ఈ జీవితంలో సుఖంలేదు. ఈ శరీరంలోంచి ఈప్రాణం వేరుకావడమే గొప్ప శాంతిసుఖము' అంది.

'అమ్మా! ఏ సంఘమర్యాదలకోసము మీరింత ఆత్మను, శరీరాన్ని, హృదయాన్ని పాడుచేసు కున్నారో, దేనియొక్క మరియాదను కాపాడటానికి మీరిప్పుడు ప్రాణత్యాగం చేసుకుంటున్నారో ఆసంఘం మిమ్ము ఉద్ధరించిందా? లేక మీరు మరణిస్తే అయ్యోయనంటుందా? మీబోటిస్త్రీలువారికి లెక్కలేదు'......

'అయ్యా! మీరెవరు చాలా తెలిసినవారులాగున్నారే' అన్నదిసుశీల.

'నేను సినిమాకంపెని డైరెక్టరును. మీరు మా కంపెనీలో పనిచెయ్యండి. మీజీవితము ఒకమోస్తరు సుఖముగా గడపవచ్చును' అన్నాడు.

'ఇన్నిరోజులు ఎంతో మానమర్యాదలతోను, ఆత్మశాంతితోను ఉన్న నన్ను స్టేజీమీదికెక్కమనెదరా? అసంభవము' అంది సుశీల.

'అమ్మా! బాగాఆలోచించుకోండి. మీయొక్కత్యాగానికి సంఘం హర్షింపదు. కేవలము మీజీవితము మాత్రం నష్టమగును. మీ రూపము, మీ కౌశలము మట్టిపాలగును. ఏ సంఘమర్యాదలకోసం మీ సర్వస్వం నష్టంచేసుకొని మరణిస్తారో ఆసంఘం ఎప్పుడైనా ఒకప్పుడన్నా మిమ్ము ఆదరించిఉన్నదా!' అన్నాడు.

'అయ్యా! ఎప్పుడులేదు అన్నది' గంభీరంగా సుశీల.

'అటువంటి దయావిహీనమైన సంఘంకోసం మీ పవిత్రమైన మానవజన్మము నెందులకు నష్టము చేసుకొనెదరు. కారు తయారుగానున్నది. వచ్చెదరా?' అన్నాడు ఆ పురుషుడు.

మారుపల్కకుండా సుశీల డైరెక్టరుతోకూడా వెళ్ళి కారులోకూర్చుంది. చూచుచుండగనే కారు అదృశ్యమయిపోయింది.

కొన్నిమాసముల తర్వాత పత్రికలలో పెద్దపెద్ద అక్షరములతో "బాల వితంతు" అను సినిమాలో హీరోఇన్‌గా ఆక్షనుచేసిన సుశీలాదేవినిగూర్చి శ్లాఘించి వ్రాసియుండిరి. బాలవితంతు సినిమా చూచిన స్త్రీ, పురుషులలో సుశీలను పొగడనివారు లేరు.

◆ ◆ ◆ ◆

శేఖరు తనటేబిల్‌పైన పడివున్న 'బాలవింతు' అను సినిమానుగూర్చి వ్రాసిన పెద్దపెద్ద అక్షరాలను చూచి తనకళ్ళను తాను నమ్మకుండా చదివినదాన్నే ఊరకచదువుతూ నిలుచున్నాడు చాలాసేపువరకు.